క్లుప్తంగా

27న రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ×ప్రమాదంలో రాజ్యాంగం – రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో మహిళల బాధ్యత । అనే అంశంపై ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పూలే – అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని అనుసరించే వారు, ప్రజా, కుల, మహిళా, విద్యార్థి, యువజన సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కర్నూలు(సెంట్రల్): చెన్నై–సూరత్ జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించి న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సింగవరం, బసవపురం, ఉల్చాల గ్రామాల రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ గ్రామాల పొలాలు ఎకరం రూ. కోటిన్నర ధర పలుకుతాయని,అయితే రూ. 12.50 లక్షలు మాత్రమే చెల్లించడం అన్యాయమన్నారు. తమ అనుమతి లేకుండా ఖాతాల్లో జమ చేయడం దారుణమన్నారు.తమకు సరైన పరిహారం చెల్లించే వరకు భూములను ఇవ్వమన్నారు.కార్యక్రమంలో నారాయణ, రాఘవేంద్ర, అబ్దుల్లా, అంజి, మాధవరెడ్డి, సుంకన్న, నాగన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

పార్శిల్ సేవలను వినియోగించుకోండి

కర్నూలు (రూరల్): ప్రజలు తపాలా శాఖ అందిస్తున్న పార్శిల్ సేవలను వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వస్తువులను పంపించడానికి కావలసిన ప్యాకింగ్ కవర్లు కూడా నగరంలోని హెడ్ పోస్టాఫీసులో అందుబాటులో ఉన్నాయన్నారు. నామమాత్రపు ధరలతో మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిరాక్స్ సెంటర్లపై ఆంక్షలు

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల ఉండే ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.బుధవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసి వేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరోగ్యం- పరిశుభ్రతపై అవగాహన పెంచుదాం

కర్నూలు (టౌన్) : ఆరోగ్యం–పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన పెంచాలని ఏపీ మాస్ జిల్లా కోఆర్డినేటర్ షణ్ముఖ అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక కమ్యూనిటీ భవనంలో ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నీరు- పారిశుద్ధ్యం–పరిశుభ్రత అన్న అంశంపై రిసోర్స్ పర్సన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సమావేశాల్లో ఆరోగ్య అలవాట్లు తెలియజేయాలన్నారు. మరుగుదొడ్ల వాడకం, చేతుల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం జయవర్దన్, ప్రమీల, టీఎంసీ సుధాకర్, అశోక్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట రెజ్లర్లకు మద్దతుగా ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో ధర్నా ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో ని మహిళలు, కవులు,కళాకారులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ నెలరోజులుగా దేశవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. భవిష్యత్‌లో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

కలెక్టర్ గారూ.. ఇటు చూడరూ!

- ద్వామా–వ్యవసాయ కార్యాలయాల మధ్య పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తచెదారం
- ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన తీసుకున్న చర్యలతో జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్‌లో కొంత మార్పు వచ్చింది. కలెక్టరేట్‌లోని కొన్ని కార్యాలయాలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. మరికొన్ని గతంలో ఎలా ఉన్నాయో అలానే ఉన్నాయి. ప్రస్తుతం స్వచ్ఛత, పరిశుభ్రత పనుల నిర్వహణపై హడావుడి తగ్గడంతో వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోతోంది. జిల్లా నీటియాజమాన్య సంస్థ, వ్యవసాయ కార్యాలయాల మధ్య ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ఆయా కార్యాలయాల వద్ద కొన్ని నెలలుగా పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. ద్వామా, డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖ సిబ్బంది ఫస్ట్‌ఫ్లోర్ నుంచి దిగడానికి మెట్లు ఉన్నాయి. అక్కడే టాయ్‌లెట్స్ ఉన్నాయి. కిందకు దిగాలన్నా, టాయ్‌లెట్‌లోకి వెళ్లాలన్నా భయపడాల్సి వస్తోంది. పై కప్పు నుంచి సిమెంటు, కాంక్రీట్ పెచ్చులు ఎప్పుడూ ఊడిపడుతాయోనన్న భయం వెంటాడుతుంది. ఇప్పటికే కొన్ని నెలలుగా ఊడిపడిన పెచ్చులు, చెత్త చెదారం అక్కడే ఉండిపోయింది. జిల్లా కలెక్టర్ సృజన స్పందించి పైకప్పునకు మరమ్మతులు చేయించడంతో పాటు ఆయా కార్యాలయాల వద్ద క్లీనింగ్‌కు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


సుద్దవాగును పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

సుద్దవాగు.. ఇక సుందరమగు

కర్నూలు (టౌన్): వర్షాకాలం వచ్చిందంటే సి.క్యాంపు నుంచి గణేష్‌నగర్ మీదుగా వెళ్లే సుద్దవాగు పొంగి సమీప కాలనీల్లో మురుగు, వర్షంనీరు పారుతుంది. ఏళ్ల తరబడిగా ఈ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం కమిషనర్ భార్గవ్‌తేజ ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. సుద్దవాగు ఒపెన్ డ్రైన్ కావడంతో చుట్టు పక్కల వాళ్లు చెత్త చెదారం, వ్యర్థాలు వేస్తున్నారు.దీనికి తోడు పూడిక పేరుకుపోయింది. ముందుగా వాగును శుభ్రం చేసే పనులకు శ్రీకారం చుట్టారు. పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని పూర్తి స్థాయిలో తొలగిస్తున్నారు. ఈపనులను మంగళవారం కమిషనరుతో పాటు డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి, మున్సిపల్ ఆరోగ్యశాఖ ఆధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పరిశీలించారు. ముందుగా సుద్దవాగు వెంబడి పెద్ద ఎత్తున్న ఉన్న సిల్ట్ తొలగించడం, అలాగే ఇరువైపులా ఫెన్సింగ్ వేయడం, అపరిశుభ్రం చేయకుండా పెద్ద ఎత్తున్న మొక్కలు నాటడం తదితర అభివృద్ధి పనులు చేయనున్నట్లు నగరపాలక కమిషనర్ వెల్లడించారు.

ఈరోజు

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రికులు బుధవారం ఉదయం 9గంటల్లోపు పాతబస్తీలోని రాయల్ ఫంక్షన్ హాలుకు చేరుకోవాలని సూచించారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఫాస్ట్ ఎక్స్, విరుపాక్ష , ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్–2, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3, సింహాద్రి
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కస్టడీ, ఫాస్ట్ ఎక్స్, బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఉగ్రం, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, సింహాద్రి
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, ది కేరళ స్టోరీ, ఉగ్రం, హసీనా, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3
భరత్ కాంప్లెక్స్ : ది కేరళ స్టోరీ, విరుపాక్ష, సింహాద్రి
శ్రీరామ : సింహాద్రి
రాజ్ : ఫాస్ట్ ఎక్స్
విజయ : బిచ్చగాడు 2

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పేదల పిల్లలు బాగా చదువుకోవాలని ముఖ్యమంత్రి అమ్మఒడి, జగనన్న కానుక తదితరవి అందజేస్తున్నారన్నారు. మనబడి నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థుల ఉతీర్ణత శాతం పెంచడంపై ఉపాధ్యాయులు దృష్టిసారించాలన్నారు. అర్థవంతంగా పిల్లలకు విద్యాబోధన చేయాలన్నారు.అలాగే కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. అంతకు ముందు సర్వసభ్య సమావేశంలో మండల స్థాయి అధికారులు వారి వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, తహసీల్దార్ రమేష్‌బాబు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూకు రెండింతల ఆదాయం

- 'ఎగ్జిబిషన్' వేలాలకు మంచి స్పందన
- పోటీ పడిన పాటదారులు
- 60 రోజులకు రూ.21 లక్షల ఆదాయం


నగరపాలకలో బహిరంగ వేలం నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు చెందిన ఎగ్జిబిషన్ నిర్వహణకు మంగళవారం నగరపాలక అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలాలకు మంచి స్పందన లభించింది. నగరపాలక ఎగ్జిబిషన్ మైదానాన్ని 60 రోజుల పాటు లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలంలో నగరానికి చెందిన పలువురు పోటీ పడ్డారు. ప్రతి రోజు రూ.15 వేల ప్రకారం స్థలాన్ని బాడుగ ఇచ్చేందుకు పిలిచిన వేలంలో వై. రామచంద్ర రూ. 25 వేలు సీకే. ప్రసాద్ రూ.20 వేలు, ఎం. ప్రభాకర్ రూ.30 వేలు చొప్పున పాట పడారు. అయితే గులామ్ శ్రీనివాసరావు అనే పాటదారుడు నిర్ణయించిన రూ.15 వేలకు రెండింతలు మించి రూ.35 వేలు పాట పాడి వేలం దక్కించుకున్నాడు. దీంతో నగరపాలక రెవెన్యూకు గణనీయంగా ఆదాయం సమకూరింది. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ మైదానం లీజుకివ్వడంతో ద్వారా రూ.21 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, వాజిద్, సుహేయిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమానికి రాజారెడ్డి కృషి


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏఎస్ బైజుబాబు

కర్నూలు(హాస్పిటల్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్ రాజారెడ్డి ఎంతో కృషి చేశారని వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.ఎస్. బైజుబాబు కొనియాడారు. వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఐటీసీ వెనుక ఉన్న స్వామి నగర్‌లో వైఎస్ రాజారెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక విభాగం, కుష్ఠువ్యాధిగ్రస్తుల విభాగంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బైజుబాబు మాట్లాడుతూ కడప జిల్లా ముద్దుబిడ్డ వైఎస్ రాజారెడ్డి ఎంతో మంది నాయకులకు రాజకీయ బిక్ష పెట్టారన్నారు. కార్యక్రమంలో కిశోర్, దాదాపీర, వెంకటేష్, ముస్తాక్, వెంకటేశ్వరరెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


వైఎస్ఆర్ కిట్లను అందజేస్తున్న డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు పుట్టబోయే బిడ్డ కోసం తగిన పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయుష్ దత్తత గ్రామమైన కర్నూలు మండలం పసుపుల గ్రామంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తల్లులకు, గర్భిణులకు వివరించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆమె ఆరోగ్యంగా ఉండటమే గాక ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తారన్నారు. అనంతరం ఆయన వైఎస్ఆర్ పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం హెల్త్ సెక్రటరీ, ఏఎన్ఎం బి.ఎలిజబెత్ రాణి, అంగన్‌వాడీ వర్కర్ ఎల్. సువర్ణ, ఆయా చిలకమ్మ, ఆశా వర్కర్లు కె.తులశమ్మ, లక్ష్మీదేవి, ధనలక్ష్మి, కాంపౌండర్ ఆర్. మంగమ్మ పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వే వంద శాతం పూర్తి చేయాలి

కర్నూలు(హాస్పిటల్): నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) సర్వే జిల్లాలో వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. మంగళవారం వివిధ వైద్య అంశాలపై వైద్యారోగ్యశాఖ అధికారులతో ఆమె కలెక్టర్ బంగ్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద ఆసుపత్రిలో చేరి డిశ్చార్జ్ అయిన రోగుల నుంచి ఏఎన్ఎంలు ఫీడ్‌బ్యాక్ రిపోర్టులు తీసుకోవడంలో నాలుగు యూపీహెచ్‌సీలు 80 శాతం కంటే తక్కువ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలినవి 90 శాతం పైగా చేస్తుంటే మీరెందుకు చేయడం లేదని, బుధవారం సాయంత్రంలోగాపు 80 శాతం కంటే తక్కువ నమోదు చేసిన యూపీహెచ్‌సీలు 90 శాతం దాటేలా తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యకు చెప్పారు. అలాగే యూపీహెచ్‌సీలో ఉన్న మెడికల్ ఆఫీసర్లు ఈ అంశానికి సంబంధించి ఏఎన్ఎంలతో సమీక్ష చేసి పురోగతి సాధించేలా చూసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ స్క్రీనింగ్ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వైఎస్ఆర్ కంటి వెలుగు కింద చేసిన సర్జరీలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ కేంద్రాల్లో ఉన్న సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ హాజరు సరిగ్గా వేయడం లేదని, గైర్హాజరవుతున్నారన్నారు. రక్తహీనతకు సంబంధించిన స్క్రీనింగ్ ఎంత వరకు చేశారని డీఎంహెచ్ఓను ఆరా తీయగా 99.35శాతం స్క్రీనింగ్ పూర్తి చేశామని, అందుఓ 65.79శాతం మంది అమ్మాయిలకు రక్తహీనత ఉందని, వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


రైల్వే ట్రాక్‌పై పడిఉన్న సయ్యద్ చాంద్ బాషా మృతదేహం

కర్నూలు: కల్లూరు మండలం బృందావన్ కాలేజీ సమీపంలోని బ్రిడ్జి వద్ద రైలు కింద పడి సయ్యద్ చాంద్ బాషా (33) ఆత్మహత్య చేసుకున్నాడు. డోన్ మండలం ఎద్దుపెంట గ్రామ పంచాయతీ మజరా గ్రామం మిద్దెపల్లె చాంద్ బాషా స్వగ్రామం. భార్య పుట్టినిల్లు తడకనపల్లె. సోమవారం సాయంత్రం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై తడకనపల్లెకు చేరుకుని మంగళవారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో బృందావన్ కాలేజ్ సమీపంలోని బ్రిడ్జి వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. తన ద్విచక్ర వాహనాన్ని సమీపంలోనే పార్క్ చేసి ఉంచాడు. రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు అందించిన సమాచారం మేరకు కర్నూలు రైల్వే పీఎస్ ఎస్ఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహం పక్కన నాలుగు ఖాళీ సారా ప్యాకెట్లు ఉండటంతో సారా సేవించి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ద్విచక్ర వాహనంతో పాటు అతని వద్ద ఉన్న ఆధార్ కార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా చాంద్‌బాషాను గుర్తించి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. కుటుంబ కలహాలే ఈ ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

అవీ-ఇవీ

పలువురు వైద్యులకు పదోన్నతి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురు వైద్యులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ స్థానాలు కేటాయించారు. జనరల్ సర్జరీలో పనిచేస్తున్న డాక్టర్ వి.వెంకట రమాబాయి, డాక్టర్ వై.శారద అనంతపురం మెడికల్ కళాశాలకు, డాక్టర్ ఎస్.విజయ బాబు, డాక్టర్ ఎన్.మల్లికార్జున నంద్యాల మెడికల్ కళాశాలకు, డాక్టర్ ఎస్.కస్తూరిబాయి (ఆప్తల్మాలజీ) కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, డాక్టర్ ఎం.రాజేష్ కుమార్ (ఆర్థోపెడిక్), డాకర్ టి.కుముద (గైనకాలజీ) కర్నూలు మెడికల్ కళాశాలకు, డాక్టర్ యు.సుజాత పట్నాయక్ (గైనకాలజీ) నెల్లూరు మెడికల్ కళాశాలకు, డాక్టర్ పి.అజయ్ కుమార్ (టీబీసీడీ) తిరుపతి మెడికల్ కళాశాలకు పదోన్నతిపై బదిలీ అయ్యారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ యూనివర్సిటీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పాత గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో నాన్ టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగుల అధ్యక్షుడిగా పి.సుంకన్న, కార్యదర్శిగా బి.మద్దయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్.ఇస్మాయిల్, సంయుక్త కార్యదర్శిగా బి.అనురాధ, ట్రెజరర్‌గా బి.చిన్న హుస్సేనయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.నాగరాజు, అడ్వైజర్ సభ్యుడిగా ఎ.మాధవశేఖర్, పది మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పి.సుంకన్న మాట్లాడుతూ వర్సిటీలోని కొంతమంది నాన్ టీచింగ్ సిబ్బందిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- ప్రతి ఒక్కరూ స్వచ్ఛ షహర్‌లో భాగస్వాములు కావాలి
- నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ


ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరా లైఫ్–మేరా స్వచ్ఛ షహర్ అన్న కార్యక్రమంలో నగర వాసులు భాగస్వాములు కావాలన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక కార్యాలయం ప్రాంగణంలో డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి ఆధ్వర్యంలో ఆర్.ఆర్.ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్) కేంద్రాన్ని కమిషనర్ ప్రారంభించారు. నిరుపయోగంగా ఉన్న వ్యర్థాలు, పుస్తకాలు, ప్లాస్టిక్ సీసాలను అక్కడే ఏర్పాటు చేసిన వేర్వేరు డబ్బాల్లో కమిషనర్ వేశారు. అలాగే నగరపాలక ఉద్యోగులు ఇంటి నుంచి తెచ్చిన పాత వస్తువులు, బట్టలు తమ వంతు బాధ్యతగా డబ్బాల్లో వేసి సంతకాలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ లో భాగంగా పర్యావరణ పరిరక్షణ సంబంధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. 52 వార్డుల పరిధిలోని కాలనీల్లో ఆర్.ఆర్.ఆర్. కేంద్రాలను వచ్చే నెల 5 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంతాలకు ప్రజలు పాత వస్తువులు, నిరుపయోగంగా ఉన్న దుస్తులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత పుస్తకాలు డబ్బాల్లో వేయాలన్నారు. తర్వాత వాటిని పునర్వియోగానికి, పునరుత్పత్తికి నగరపాలక చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ శేషాసాయి, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, ఆర్ఓ జునీద్ పాల్గొన్నారు.

అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు నేనే చూస్తా

కర్నూలు(సిటీ): జిల్లా విద్యాశాఖ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలను ఇకనుంచి నేనే చూస్తానని, ఆఫీస్‌లో జరిగే విషయాలన్నీ బయటకు ఎలా తెలుస్తున్నాయంటూ డీఈఓ వి.రంగారెడ్డి ఆఫీస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన అంశాలపై తనకు అవగాహన లేదన్నట్లు సిబ్బంది తన పట్ల వ్యవహరించడం సరికాదని, నాకు సర్వీస్ అంశాలపై పట్టు ఉందని, ఏడీ బాధ్యతలు తనకు అప్పగించాలని ఆఫీస్ సిబ్బందిపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీంతో ఆ బాధ్యతలను ఆయనకే అప్పగించాలని ఇప్పటివరకు ఏడీగా బాధ్యతలు నిర్వహించిన ఉద్యోగి సెక్షన్ సిబ్బందికి సూచించారు. కాగా ప్రస్తుతం జిల్లా విద్యాశాఖలో అత్యంత కీలకమైన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియ జరుగుతోంది. ఇలాంటి సమయంలో పరిపాలన విభాగంలో అనుభవం ఉన్న ఉద్యోగి నుంచి డీఈఓ బాధ్యతలు తీసుకోవడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకపై తనకు తెలియకుండా ఆఫీస్ విషయాలు బయటివారికి తెలియజేస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించినట్లు తెలిసింది.

ఏఆర్‌టీ మందులతో జీవితకాలం పెరుగుదల


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీహరి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వం అందించే ఏఆర్‌టీ మందులతో హెచ్‌ఐవీ బాధిత చిన్నారుల జీవితకాలం పెరుగుతుందని ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డాక్టర్ శ్రీహరి చెప్పారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారికి మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్‌లో నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ చిన్నపిల్లలందరికీ కూడా వారి బరువును బట్టి ఏఆర్‌టీ మందులు ఇస్తున్నామని, వాటితో పాటు పౌష్టికాహారం తీసుకునేటట్లు వారి తల్లిదండ్రులు చూసుకోవాలని చెప్పారు. అప్పుడే అందరిలాగా సమానంగా జీవించవచ్చన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పౌష్టికాహారాన్ని బేతంచర్ల పారిశ్రామిక వేత్త గౌరి వెంకటరామిరెడ్డి సహకారంతో అందజేశామన్నారు. కార్యక్రమంలో నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు బి.సుధారాణి, షేర్ ఇండియా ప్రోగ్రామ్ అధికారి కె. రాజ్‌కుమార్, వైఆర్‌జీ కేర్ కో ఆర్డినేటర్ పి. ప్రసాద్, మహేష్, కేర్ సపోర్ట్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి మహాసభలు


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కర్నూలు (రూరల్): అఖిలభారత తపాలా ఉద్యోగుల (పోస్ట్‌మెన్, ఎంటీఎస్) తృతీయ రాష్ట్ర ద్వైవార్షిక మహా సభలను ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని ఆ సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం నగరంలో హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో సంఘం నాయకులు మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నేత శరత్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నగరంలో బీఏఎస్ కళ్యాణ మండపంలో జరిగే సభలను జయప్రదం చేయాలని కోరారు. సభలకు ముఖ్య అతిథులుగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు నరసింగరావు, మాజీ ఎమ్మెల్యే గఫూర్, ప్రజా అభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ వస్తున్నారన్నారు. కావున తపాలా ఉద్యోగులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో శివనాగేంద్ర, శేఖర్ బాబు, మల్లికార్జున, జగదీష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయంలోని రెవెన్యూ విభాగం హాలులో మంగళవారం వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరంలోని వివిధ సచివాలయాల్లో 121 వలంటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం 415 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఇంటర్వ్యూలకు 224 మంది హాజరయ్యారు. వీరికి నగరపాలక సూపరింటెండెంట్లు పి. క్రిస్టఫర్ బాబు, స్వర్ణలత, సీనియర్ అసిస్టెంట్లు కె. శ్రీదేవి, సుబ్బన్న ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం వలంటీర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల వ్యవధిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను నగరపాలక కార్యాలయంలో ప్రదర్శిస్తామని చెప్పారు.